క్లుప్తంగా...

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



నాగారం శ్రీరామ్‌నగర్‌కాలనీలో వైద్య శిబిరం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో శ్రీధరణి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్య శిబిరంలో వైద్యులు ఉచితంగా కాలనీవాసులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, వైద్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



మేడ్చల్: ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా నేతలు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, తల్లులకు పండ్లను పంపిణీ చేశారు. 8వ వార్డు కౌన్సిలర్ చాపరాజు నాయకులతో కలిసి పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలోని తల్లులకు మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలను పరిష్కరిస్తా



కాలనీవాసులతో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని సాయినగర్ కాలనీలోని సమస్యలను చైర్మన్ కొండల్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంతలమయమైన రోడ్లపై మట్టి పోయించి చదును చేస్తామని చెప్పారు. వీధి దీపాలు, తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి వస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు గణేష్, బుచ్చిరెడ్డి, ప్రవీణ్ కుమార్, సత్యం, చెన్నూరు శ్రీనివాసులు, అలిబాయ్, కోటిరెడ్డి, దిలీప్, సుధాకర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ



జవహర్‌నగర్: సోదరి పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు ఇంటిని లూటీ చేశారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాప్రా సాకేత్‌లో చోటుచేసుకుంది. జవహర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ వివరాల ప్రకారం.. కాప్రా జమ్మిగడ్డలోని సాకేత్ కాలనీ ఫేస్–1లో కె.రామసుబ్బ నర్సింహశాస్త్రీ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తాజ్‌క్రిష్ణలో తన సోదరి రిసెప్షన్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అర్ధరాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డితో పాటు డీఐ మధుకుమార్ వచ్చి సీసీ పుటేజీలను పరిశీలించి క్లూంటీంతో వివరాలు సేకరించారు. 5 తులాల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండి ఆభరణాలు, 3 ల్యాప్‌టాప్‌లు అపహరణకు గురైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఐపీఎల్ నేపథ్యంలో క్విజ్

సాక్షి, సిటీబ్యూరో: ఐపీఎల్ పోటీలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ వేర్ బ్రాండ్ పరిమ్యాచ్ స్పోర్ట్స్.. క్రికెట్ ప్రేమికుల కోసం ఓ క్విజ్ పోటీ ప్రారంభించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ద్వారా లేదా నగరంలోని మాల్స్‌లో తాము ఏర్పాటు చేసిన ఫొటోబూత్‌లో అభిమాన క్రికెటర్ బొమ్మతో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం ద్వారా రెండు రకాలుగా పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.



పంటసాగుకు ప్రణాళిక సిద్ధం

రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ శాఖ ఏర్పాట్లు

- విత్తనాలు, ఎరువులు, పంట రుణాలపై కసరత్తు
- వివిధ పంటల సాగు విస్తీర్ణం 26,807 ఎకరాలు
- ఇందులో ఉద్యాన పంటల సాగు 8,230 ఎకరాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: లాభసాటి పంటలను దృష్టిలో పెట్టుకుని పంట మార్పిడికి అనుగుణంగా వానాకాలం పంట సాగుపై జిల్లా వ్యవసాయశాఖ ప్రణాళిక ఖరారు చేసింది. పంట సాగుకు సంబంధించిన రైతులకు సరిపడా విత్తనాలు, ఫర్టిలైజర్, పంట రుణాల పంపిణీపై వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. వానాకాలం పంటసాగులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 26,807 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసేలా ప్రణాళిక రూపొందించిన వ్యవసాయ శాఖ ఇందులో 8,230 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేలా చర్యలు చేపట్టింది. పంట పెట్టుబడి కింద ప్రభుత్వం ప్రతి ఏటా అందిస్తున్న రైతుబంధు పథకానికి సంబంధించి రైతులకు జూన్ వరకు తమ ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా కసరత్తు జరుగుతోందని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వానాకాలంలో జిల్లాలో 33,848 మంది రైతులకు ఈ పథకం కింద వారి ఖాతాల్లో ప్రతీ ఏటా రూ.33.03 కోట్లు ప్రభుత్వం జమ చేస్తోంది.

వానాకాలం పంట సాగు ప్రణాళిక ఇలా..

మేడ్చల్ జిల్లాలో వానాకాలం పంటసాగు విస్తీర్ణం 26,807 ఎకరాలు కాగా, ఇందులో 8,230 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేలా వ్యవసాయ, ఉద్యాన శాఖలు చర్యలు తీసుకుంటోంది. వరి పంట సాగు 12,713 ఎకరాలు కాగా, కంది పంట సాగు 1,786 ఎకరాలుగా నిర్ణయించారు. పత్తిపంట 1,000 ఎకరాలు, జొన్న పంట 306 ఎకరాల ఆముదం పంట 11 ఎకరాలు, చెరుకు పంట నాలుగు ఎకరాలు, సీడ్ కోసం మొక్కజొన్న పంటసాగు 935 ఎకరాలు, మిగిలిన ఏరియాల్లో పశుగ్రాసం పంట సాగు చేసేలా వానాకాలం ప్రణాళిక రూపొందించారు. అలాగే 8,230 ఉద్యాన పంట సాగులో భాగంగా 4,111 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటల పంటలు, 3,919 ఎకరాల్లో కూరగాయలు, తీగజాతి ఆకుతోట పంటలు, మిగతా ఏరియాల్లో పూల తోటలు సాగయ్యేలా వానాకాలం పంట ప్రణాళిక ఖరారు చేశారు. వానాకాలం పంట సాగుకు అనుగుణంగా సరిపడా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ శాఖ పేర్కొంటోంది.

అందుబాటులో ఎరువులు

మేడ్చల్ జిల్లాకు వానాకాలంలో 6,722 మెట్రిక్ టన్నుల ఎరువులు, ఫర్టిలైజర్ అవసరం కాగా, దీనికి మించి 1806 మెట్రిక్ టన్నుల యూరియా, 3,576 మెట్రిక్ టన్నుల డీఏపీ, 259 మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 1274 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 7,640 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచారు. ఈ ఎరువులు సొసైటీల ద్వారా రైతులకు విక్రయించేలా జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంది.

6,522 రైతులకు పంట రుణాలు రూ.48 కోట్లు

వానాకాలం పంట సాగులో భాగంగా మేడ్చల్ జిల్లాలో 6,522 మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా రూ.48 కోట్ల పంట రుణాలు పంపిణీ చేయాలని నిర్ణయించటంతోపాటు అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది.

నేటినుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

- 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో క్రీడలు
- జిల్లాస్థాయిలో 22 నుంచి 24 వరకు పోటీలు
- కలెక్టర్ చైర్మన్‌గా జిల్లాస్థాయిలో క్రీడల కమిటీ
- ఎంపీపీ చైర్మన్‌గా మండల స్థాయిలో కమిటీలు



సాక్షి, మేడ్చల్‌జిల్లా : తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సీఎం కప్ పేరుతో మండల స్థాయి, జిల్లాస్థాయిలో క్రీడలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. క్రీడల నిర్వహణ, విజయవంతం చేసేందుకు జిల్లాస్థాయిలో కలెక్టర్ అమయ్‌కుమార్ చైర్మన్‌గా జిల్లాస్థాయి క్రీడల కమిటీ ఏర్పాటైంది. అలాగే, మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్‌గా మండల స్థాయి క్రీడల కమిటీలను ఏర్పాటు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 5 మండలాల్లోనే క్రీడలు నిర్వహిస్తారు. ప్రతీ మండలంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది.

నేటినుంచి మండల స్థాయిలో..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో శామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, మేడ్చల్, మూడుచింతలపల్లి మండల కేంద్రాల్లో సోమవారం నుంచి 17 వరకు నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల స్థాయిలో అథ్లెటిక్స్(మహిళలు/పురుషులు), ఫుట్‌బాల్(పురుషులు), కబడ్డీ (మహిళలు/ పురుషులు), ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రీడలను విజయవంతం చేసేందుకు మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల్లో ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీఓ కన్వీనర్‌గా ఉంటారు. సభ్యులుగా జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ/గజిటెడ్ హెడ్‌మాస్టర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఫిజికల్ డైరెక్టర్/పీఈటీలు ఉంటారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు మెరిట్ సర్టిఫికెట్స్ అందజేస్తారు. ఈ క్రీడా పోటీల్లో 15 నుంచి 36 సంవత్సరాలు వయస్సు ఉన్న పురుషులు/మహిళలు పాల్గొనాల్సి ఉంటుంది. మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ప్రభుత్వం ప్రతి మండలానికి రూ.15 వేలు కేటాయించారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారుల జాబితాను సంబంధిత కమిటీలు ఈ నెల 18 వరకు జిల్లా యువజన, క్రీడలశాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని ఆ శాఖ అధికారి బి.బలరామారావు తెలిపారు.

ఈనెల 22 నుంచి జిల్లాస్థాయి క్రీడలు

మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈ నెల 22 నుంచి 24 వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా స్థాయి క్రీడా పోటీలు 11 విభాగాల్లో నిర్వహించనున్నారు. పోటీలను హకీంపేట్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తారు. పాల్గొన్న క్రీడాకారులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 29 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.75 వేలు, మూడవ విజేతకు రూ.50 వేలు అందజేస్తారు. అలాగే వ్యక్తిగత క్రీడాంశంలో మొదటి విజేతకు రూ.20 వేలు, రెండవ విజేతకు రూ.15 వేలు, మూడవ విజేతకు రూ.10 వేలు నగదు రూపంలో సీఎం కప్‌తోపాటుగా అందజేస్తారు. జిల్లాస్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వయస్సు ధృవీకరణ పత్రం లేదా 10వ తరగతి మెమో, ఆధార్ కార్డును తప్పని సరిగా అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని జిల్లా యువజన, క్రీడలశాఖ పేర్కొంది.

బీఆర్ఎస్ సమావేశాలకు గురుకుల విద్యార్థులా..?

- ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరపాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోశ్



ఘట్‌కేసర్: బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి విద్యార్థినులను పంపిన గురుకుల ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనానికి గురుకుల విద్యార్థినులను ఎటువంటి భద్రత లేకుండా సమావేశాలకు తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ సమావేశానికి గురుకుల విద్యార్థినులకు సంబంధం ఏమిటీ, వారికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పార్టీ సమావేశానికి విద్యార్థినులను ఎందుకు పంపారన్న విషయంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలకు మంత్రి మల్లారెడ్డి స్వయంగా తిరిగి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటికి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా శిఖర ప్రతిష్ఠ మహోత్సవం



మేడ్చల్‌రూరల్: పూడూర్ గ్రామంలోని రామభక్త ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ఆలయంలో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన సోమేశ్‌యాదవ్ అన్నదానం నిర్వహించగా సాయంత్రం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, వార్డు సభ్యులు శశికుమార్‌యాదవ్, శ్రీకాంత్, ఉమారాణినాగేశ్, ఆలయ నిర్వాహకులు శోభన్‌బాబు, కిశోర్, గోపాల్‌యాదవ్, శ్రీనివాస్, నాగేశ్, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికే ప్రాధాన్యం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ విహారిక సీ సెక్టార్ కాలనీ అసోసియేషన్ సాధారణ సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో జరిగిన అభివృద్ధి, అవసరమైన పనులపై చర్చించారు. అనంతరం కాలనీవాసులు రాంకోటి నాయక్, నాగార్జున, యాదగిరి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కార్యదర్శి రాజ్‌కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం పనులు ప్రారంభం



జేసీబీతో చదును చేయిస్తున్న సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడలో నూతనంగా నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణం పనులను సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్ ఆదివారం ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశానుసారం స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మీ చౌదరిగూడ క్రీడా ప్రాంగణం కోసం సర్వే నంబర్ 808లో 20 గుంటల భూమి కేటాయించగా సర్పంచ్ జేసీబీతో చదును చేయించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భోజిరెడ్డి, స్వామిదాస్, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, మల్లేశ్‌ముదిరాజ్, నాయకుడు శేఖర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు నర్సింగ్‌రావు ముదిరాజ్, స్థానికులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన మేడ్చల్ విద్యార్థులు

మేడ్చల్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. నగరంలో నిర్వహించిన పోటీల్లో మేడ్చల్‌కు చెందిన యూనివర్సల్ 369 అకాడమికి చెందిన విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. అండర్–10 విభాగంలో మని కృతిక్, బంగారు పతకం, అండర్–14 విభాగంలో శ్రీతన్ సిల్వర్ మెడల్ సాధించారు. మరో 14 మంది విద్యార్థులు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



బోడుప్పల్: 10వ తరగతి వార్షిక ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ఆ పాఠశాల కరస్పాండెంట్ కె.రాంచంద్రారెడ్డి నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఇందిరానగర్ కాలనీలోని న్యూటన్ గ్రామర్ హైస్కూల్ 2022–23 సంవత్సరంలో ఆ పాఠశాల విద్యార్థి బి.అరవింద్‌గౌడ్ 10/10 జీపీఏ సాధించాడు. ఆయనకు ఆదివారం కరస్పాండెంట్ రాంచంద్రారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థితిలో ఉండేందుకు ప్రణాళికలు రూపొందించుకుని, ఆ దిశగా అడుగులు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జులు జయశ్రీ, మిస్సరాణి, లూసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాల వార్షిక సమ్మేళనం



సమావేశంలో శ్రీచైతన్య ప్రతినిధులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి శ్రీచైతన్య పాఠశాల వార్షిక సమ్మేళనాన్ని అనసూయ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. సమ్మేళనంలో విద్యార్థులు సాధించిన అద్భుత విజయాలపై పాఠశాలల ఆలిండియా కో ఆర్డినేటర్ బీవీ సతీష్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధన వెనుక ఉన్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. సమావేశంలో వివిధ బ్రాంచీల 1200 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా వారిని యాజమాన్యం సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సమావేశంలో పాఠశాల ఏజీఎం రమణారావు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



కీసరలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి సేవలో నవీన్‌మిట్టల్ దంపతులు



ఘట్‌కేసర్‌లో అన్నదానం చేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య దంపతులు

దేశ ప్రజలంతా సమానమే..

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఏ ఒక్కరి కోసమో రాజ్యాంగం రాయలేదని, సబ్బండ వర్గాలు, దేశ ప్రగతి కోసం రాశాడని పోచారం మున్సిపల్ కౌన్సిలర్, సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరిప్రసాద్ రావు అన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఘట్‌కేసర్‌లో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహం పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పౌరులు ఎవరూ తక్కువ కాదని, ప్రతి ఒక్కరూ సమానమే అన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అనుసరించి స్వేచ్ఛ, సమానత్వం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేకల దాను, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, ఆనంద్, రాజేశ్‌కుమార్, యాదగిరి, సాయిరాజ్, గణేశ్, నారాయణ, వరందాస్, భరత్‌కుమార్, అర్జున్, లింగం, కృష్ణంరాజు, మహిపాల్, విష్ణు, రాముల, సచిన్, నితిన్, భానుచందర్, కేతన్ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న హరిప్రసాద్

ఘనంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతిని అన్ని ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొనగా వారి కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణమే కనిపించింది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో ఆలయాల్లోని చలువ పందిళ్లలో భక్తులు సేదతీరారు. ఆయా ఆలయాల నిర్వాహకులు అన్నదానాలు చేయడంతో పాటు తాగునీటి వసతి కల్పించారు.



ఘట్‌కేసర్‌లో బజరంగ్‌దళ్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో..



శివారెడ్డిగూడలో..



కీసర హనుమాన్ దేవాలయం వద్ద..